## కేసీఆర్‌ను విమర్శించడం సరికాదు



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, మే 1 : రవీంద్ర భారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం సరికాదని బీఆర్‌ఎస్ నస్రుల్లాబాద్ మండల నాయకులు అన్నారు. నస్రుల్లాబాద్‌లో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో అమలు కాని హామీలు పెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. తెలంగాణ ప్రజల దృష్టి మళ్లించడానికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్ పాత్ర ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ కోసం 14 సంవత్సరాలు కొట్లాడి సాధించి 10 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా అద్భుతమైన పరిపాలన అందించిన కేసీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలే ఆయనకు సమాధి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు గౌడ్, అఫ్రోజ్, సాయిలు, లక్ష్మణ్ రాథోడ్, రాజు, సాయిలు, రవీందర్ పాల్గొన్నారు.

## నీటి సమస్యను గుర్తించి పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, మే 1 : పట్టణంలో పర్యటించి నీటి సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశపు హాల్‌లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లతో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే, ప్రాపర్టీ టాక్స్‌పై ఐదు శాతం రాయితీని ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. బిల్ కలెక్టర్లు ఇంకా పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ టాక్స్‌ను వసూలు చేయాల్సిందిగా ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున వార్డు ఆఫీసర్లు వారి వార్డుల్లో పర్యటించి నీటి సమస్యను గుర్తించి సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. త్వరగా రేషన్‌కార్డు సర్వేను పూర్తి చేయాలని సూచించారు. వార్డుల్లోని ప్రజలతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఆయనతో పాటు వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు ఉన్నారు.

# వరి కొయ్యలకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు



బోర్లం క్యాంపులో వరి కొయ్యలకు నిప్పు పెట్టిన రైతులు



వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో కొయ్యగుట్ట వద్ద కాలిపోతున్న మొక్కలు

- **కాలిపోతున్న అవెన్యూ ప్లాంటేషన్**
- **రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్న ప్రజలు**

బాన్సువాడ రూరల్, మే 1 : అధిక ఉష్ణోగ్రతలకు తోడు.. రైతులు వరి కొయ్యలకు నిప్పు పెడుతుండడంతో మరింత ఉష్ణోగ్రతలు పెరిగి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. వ్యవసాయ పంటలు పూర్తి కావడంతో రైతులు వరి కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. దీంతో దట్టమైన పొగ వాతావరణంలో కలిసి పర్యావరణం కాలుష్యం అవుతున్నది. గ్రామాలకు ఆనుకొని పొలాలు ఉండగా, నిప్పు పెట్టడంతో పొగ వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు తెలంగాణకు హరితహారం పథకంలో అవిన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు కాలిపోయి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతున్నది.

గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. నిప్పు పెట్టడంతో రోడ్డుకు ఇరువైపులా నాటిన వందలాది మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గ్రామాల వారీగా రైతులకు వరి కొయ్యలకు నిప్పు పెట్టకుండా ముందుస్తు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. పొలాల్లో నిప్పు పెట్టడంతో కలిగే నష్టాన్ని రైతులకు వివరించాలని వారు కోరుతున్నారు.

## బిల్డింగ్ పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

కామారెడ్డి, మే 1 : భర్త వేరే అమ్మాయితో మాట్లాడుతున్నాడని బిల్డింగ్ పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్నదని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపేట మండలం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన బండి పసుపులేటి పూజిత పసుపులేటి సాయితో ఆగస్టు 23వ తేదీ 2024లో వివాహం జరిగింది. కొన్ని రోజులుగా సాయి వేరే అమ్మాయితో ఫోన్లో మాట్లాడుతున్నాడనే విషయం తెలుసుకొని భర్తను ప్రశ్నించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వివాహ సమయంలో ఒప్పుకున్న అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేసే విషయంలో కూడా గొడవ పడ్డారు. దీంతో బుధవారం రాత్రి బిల్డింగ్ పైకిఎక్కి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. తండ్రి కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు చిట్యాలకు ఎమ్మెల్యే రాక

లింగంపేట(తాడ్వాయి), మే 1 : తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిట్యాల గ్రామానికి మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# కొనసాగుతున్న ధాన్యం తూకం

లింగంపేట, మే 1 : మండలంలోని ఆయా గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం కొనసాగుతున్నట్లు ఏపీఎం చామంతి శ్రీనివాస్ తెలిపారు. సెర్ప్ ఆధ్వర్యంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో 633 మంది రైతుల నుంచి 37,965 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దొడ్డు రకం ధాన్యంతోపాటు సన్న రకం ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.



కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న హమాలీలు

## ఫరీద్‌పేటలో బడి బాట



గ్రామంలో బడిబాట నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

కామారెడ్డి, మే 1 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామంలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌లో చదివిన పూర్వ విద్యార్థులు గురువారం బడి బాట కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలో చదివి ఉద్యోగం, వ్యాపార రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.శంకర్ మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు బడిని బతికించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్క పూర్వ విద్యార్థిపై ఉందని అన్నారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఐఐటీ, నీట్‌కు అనుగుణంగా విద్యాబోధన, పాఠశాలలో మౌలిక సదుపాయల ఏర్పాటుకు తగిన ఆర్థిక వనరులు కల్పించే బాధ్యత తీసుకుంటామని పూర్వ విద్యార్థులు అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాంమోహన్‌రావు, పూర్వవిద్యార్థులు పల్లె రమేశ్‌గౌడ్, సిద్దరాంరెడ్డి, సీఐ వెంకటరాజాగౌడ్, కొంగల వెంకట్, రాజు, లక్ష్మీరాజం, దీపక్‌గౌడ్, వెంకట్‌రాములు, చిన్నయ్య, బాల్‌రాజ్, గోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీకాంత్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

నస్రుల్లాబాద్, మే 1 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేశ్‌చంద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సిబ్బందికి సూచించారు. కేసులను త్వరితగతిన పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సై లావణ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మిషన్ భగీరథ పైపులైన్ పరిశీలన



మాందాపూర్ మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఏఈ రజిత

బీబీపేట్, మే 1 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ ఏఈ రజిత, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి తదితరులు కలిసి గ్రామంలో నీటి సమస్యలు రాకుండా ఉండేందుకు మిషన్ భగీరథ పైప్‌లైన్లను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు చింతకుంట రాకేశ్‌రెడ్డి, రొడ్డ రాజు, శ్రీనివాస్‌గౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు ప్రారంభమైన వేసవి సెలవులు

ఎల్లారెడ్డి రూరల్, మే 1 : అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఈ నెల మొత్తం వేసవి సెలవులను మంజూరు చేసినట్లు అంగన్‌వాడీ టీచర్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు దేవకర్ణ తెలిపారు. దీనికి సంబంధించి ఐసీడీఎస్ శాఖ మంత్రి సీతక్క ఉత్తర్వులు జారీచేసినట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, సీఐటీయూ నాయకత్వంలో చాలా కాలంగా చేసిన ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా, ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం మే నెల మొత్తం సెలవులు ప్రకటించిందన్నారు. నెల రోజులపాటు సెలవులను మంజూరు చేసినందుకు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు దేవకర్ణ, సుమిత్ర, దుర్గ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి, మే 1 : జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఎదుట టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ వెంకట్‌గౌడ్ మా ట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, వేతన సవరణ బకాయిలు చెల్లించాలని కోరుతూ.. సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు వెంకట్‌గౌడ్, మూర్తి, బాలాగౌడ్, శేఖర్, ప్రేమ్ కుమార్, గిరి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి, మే 1: కోటగిరిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ(బాలుర)లో 2025-2026 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ ఫస్ట్ ఇయర్ ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 శాతం(60) సీట్లు మైనార్టీలు, 25 శాతం(20) బీసీ-10, ఎస్సీ-4, ఎస్టీ-4, ఓసీ-2 సీట్లు, మైనార్టీయేతర విద్యార్థులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కాలేజీలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4:30గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే ఒకటో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉన్నదని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9154365020, 9493040786 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జూన్ రెండు నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె విరమణ

భిక్కనూరు, మే 1 : తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రాంగణంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పది రోజులుగా చేస్తున్న సమ్మెను గురువారం విరమించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, తెలంగాణ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్, రిజిస్టర్ ఆదేశాల మేరకు సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ప్రతిజ్ఞ, కాంట్రాక్ట్ అధ్యాపకులకు నిమ్మరసం అందజేసి సమ్మెను విరమింపజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల కో ఆర్డినేటర్ నారాయణ, యాలాద్రి, సునీత, నర్సయ్య రమాదేవి, వైశాలి, సరిత, శ్రీకాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగలను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

నస్రుల్లాబాద్, మే 1 : బీర్కూర్ మండలం వెంకటప్పయ్య క్యాంపులో గురువారం దొంగతనానికి వచ్చిన వారిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామానికి చెందిన బాపి రాజు అనే వ్యక్తి ఐదు రోజులు క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్లాడు. బుధవారం అర్ధరాత్రి బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బాపిరాజు ఇంట్లోకి చొరబడ్డారు. దొంగతనానికి వచ్చారని పక్కింట్లో ఉన్న మహిళ అదే గ్రామానికి చెందిన కిశోర్ అనే వ్యక్తికి ఫోన్ చేసింది. వెంటనే ఆయన రావడంతో దొంగలు పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు.

# ఘనంగా మేడే వేడుకలు



కామారెడ్డిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మే 1 : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మేడేను ఘనంగా గురువారం జరుపుకొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పలు పార్టీల నాయకులతోపాటు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కార్మికులకు ఎనిమిది గంటల పని కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని అన్నారు. కామారెడ్డిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో, విద్యుత్ కార్యాలయంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వీ.ఎల్.నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి బాలరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో మేడే వేడుకలను కార్మికులు గ్రామస్తులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు కమ్మరి రాజయ్య మాట్లాడుతూ.. కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మన్నె సాయిలు, కార్మికులు సులేమాన్, విజయ్ సంగమేశ్వర్, మంద నారాయణ, రాములు, మంగలి బస్వయ్య, రాజారాం తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, వివిధ శాఖల కార్మికులు దేవకర్ణ, మహేందర్, సాయన్న, విజయేందర్, వేణుగౌడ్, శ్యాం, సద్దాం, విజయ్, మహేందర్, సాయిబాబ, రాములు, పద్మ, శోభ, లలిత తదితరులున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఉద్యోగులు, 1004 యూనియన్ అధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది రాజాగౌడ్, కాశీరాం, అమృనాయక్, బాల్‌కిషన్‌గౌడ్, పాండు తదితరులున్నారు. పట్టణంలోని ఉప్పరిసంఘం వద్ద భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో శ్యామ్, రజాక్, సంగమేశ్వర్, వేణు తదితరులున్నారు. మార్కెట్ కమిటీ గిడ్డంగుల వద్ద గోదాం కార్మికుల ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. లింగంపేటలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడే స్ఫూర్తిగా ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, నాన్య, రెడ్డిసింగ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, భవన నిర్మాణ కార్మికులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణంలో సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఐ ఇన్‌చార్జి బిల్డింగ్ అండ్ వర్కర్స్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ రాములు మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తోటపల్లి శ్రీనివాస్, శివాజీ, రాజు, కుమార్ దేవాంగ, కమ్మరి సాయిలు, ఒల్లెపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డితోపాటు గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్, అక్కాపూర్, ఎల్లంపేట గ్రామాల్లో మేడే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలో మేడేను మేస్త్రీ కార్మిక సంఘం అధ్యక్షుడు భూమయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేస్త్రీ కార్మిక సంఘం సభ్యులు పిట్లం రాజాగౌడ్, సూరిగౌడ్, పండరి, కాంతారావు, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద, జుక్కల్‌లో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై గోదామ్ వద్ద ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, హమాలీ సంఘం ఉపాధ్యక్షుడు పండరి, అంజయ్య, సంతోష్, రవి, నాందేవ్, శివాజీ, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బోర్లంలో మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు, గ్రామస్తులు



ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ గిడ్డంగుల వద్ద..



లింగంపేటలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి..



తాడ్వాయిలో..



బాన్సువాడలో..



బిచ్కుందలో..

## బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా వినీల్ కుమార్



జడ్జీని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

బిచ్కుంద, మే 1 : బిచ్కుంద మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా జాడ వినీల్‌కుమార్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భం గా ఆయనకు న్యాయవాదులు స్వాగతం పలికారు. బార్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్ పటేల్, జనరల్ సెక్రటరీ శివాజీ, ఉపాధ్యక్షుడు ఆర్‌బీ దేశ్‌ముఖ్, ట్రేజరి విఠల్, న్యాయవాదులు మల్లేశ్వర్, మహమ్మద్, పురుషోత్తం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్ ప్రారంభం

లింగంపేట, మే 1 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సమ్మర్ క్యాంప్ ప్రారంభించినట్లు మండల విద్యాశాఖ అధికారి షౌకత్ అలీ తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్రీడలతో పాటు వివిధ రంగాల్లో శిక్షణ కోసం ప్రత్యేకంగా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం వాలీబాల్ క్రీడలపై శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వహీద్ సిద్దిఖీ వాలీబాల్ శిక్షణ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వాలీబాల్ క్రీడలు 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

**బాన్సువాడలో..**

బాన్సువాడ, మే 1 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని బాన్సువాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శిక్షకుడు సురేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు వాలీబాల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న 14 ఏండ్లలోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9908370837 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## డీలక్స్ బస్సుల్లో పది శాతం రాయితీ

ఖలీల్‌వాడి, మే 1: నిజామాబాద్ నుంచి వరంగల్ వెళ్లే ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో పది శాతం రాయితీ కల్పించినట్లు టీజీ ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు ఉన్నతస్థాయి ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు, సురక్షితంగా గమ్యాన్ని చేర్చేందుకు వీలుగా ఈ అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.